## 18న కేటీఆర్ రాక

ఆమనగల్లు, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 18న నిర్వహించనున్న రైతు మహాధర్నా కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నట్లు పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు పోనుగోటి అర్జున్‌రావు, నేనావత్ పత్యానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

## 15న జాబ్ మేళా

**ఉపాధి కల్పన జిల్లా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్**



వికారాబాద్, ఫిబ్రవరి 12 : శ్రీని అగ్రి ల్యాబ్స్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి కల్పన జిల్లా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయ్‌మెంట్ జిల్లా కార్యాలయం, వికారాబాద్‌లోని ఐటీఐ క్యాంపస్‌లో ఈ నెల 15న ఉదయం 10.30గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ల్యాబ్స్‌లో 50 ఫీల్డ్ స్టాఫ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అబ్బాయిలు, అమ్మాయిలు అందరూ అర్హులన్నారు. ఉద్యోగానికి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లమో ఇన్ అగ్రికల్చర్, డిప్లమో ఇన్ హార్టికల్చర్ విద్యార్హత ఉండాలన్నారు. ఈ పోస్టులు వికారాబాద్ జిల్లా పరిధిలో ఉన్నాయని, జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నేరుగా ఉద్యోగ అవకాశం కల్పిస్తారని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్ సెల్ ఫోన్ 9676047444 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## కొలకలూరి సాహిత్య పురస్కారాలు

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 12: 2025కు గాను ఆచార్య కొలకలూరి సాహిత్య పురస్కారాలకు ఎంపికైన గ్రంథాలను బుధవారం కమిటీ ప్రకటించింది. కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారానికి ప్రముఖ కవి జూకంటి జగన్నాథం రచించిన ఒక కప్పుచాయ్–నాలుగుమెసేజ్‌లు, నాటక విభాగంలో కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారానికి నాటకకర్త డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య నాటకీకరణ చేసిన స్వర్గాదపి గరీయసీ, కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారానికి పరిశోధకుడు డాక్టర్ గడ్డం మోహన్ రావు గ్రంథం చిందోళ్ల చరిత్ర, సంస్కృతి–సాహిత్యం పురస్కారాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. పురస్కారం కింద ఒక్కొక్కరికీ రూ.15వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించనున్నట్లు తెలిపారు. ఈనెల 26న నాంపల్లి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో గల ఆడిటోరియంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

# రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలి

- డీఆర్‌డీవో పీడీ శ్రీలతారెడ్డి
- ఉపాధి హామీ పనులపై అధికారుల తనిఖీ



మొయినాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ శ్రీలతారెడ్డి

మొయినాబాద్, ఫిబ్రవరి 12 : గ్రామీణ ఉపాధి హామీ పనుల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీఆర్‌డీవో పీడీ శ్రీలతారెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల పరిధిలో జరిగిన పనుల వివరాలు తెలుసుకోవడానికి డీఆర్‌డీవో అధికారులు బుధవారం గ్రామల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పనులను తనిఖీ చేశారు. అనంతరం మం డల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించి ఐదో విడుత సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏయే పనులు చేశారు, సీసీ రోడ్ల పనులు పూర్తి చేశారా? ఎన్ని పూర్తయ్యాయి? అసంపూర్తి గా ఉన్న పనులు ఎన్ని? అని గ్రామాల కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందిని అడిగి, పూర్తయిన పనుల రికార్డులను తనిఖీ చేశారు. అసంపూర్తి పనులకు కారణాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి రికార్డులు అన్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మొ క్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణ చాలా కీలకమన్నారు. మొక్కలు నాటిన తర్వాత చనిపోతే ఆ ప్రదేశంలో కొత్తవి నాటాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో చరణ్‌గౌతమ్, అంబుడ్స్ సునీత, ఎంపీడీవో సంధ్య, ఏపీవో సుశీల, విజిలెన్స్ కొండయ్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

### పారదర్శకంగా సామాజిక తనిఖీ

ఆమనగల్లు : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పారదర్శకంగా, నిబంధనల ప్రకారం అమలు చేయడానికే ఏటా సామాజిక తనిఖీ నిర్వహించి ప్రజా వేదికలో సమీక్షిస్తున్నట్లు డీఆర్‌డీవో శ్రీలత తెలిపారు. ఆమనగల్లు మండల పరిధిలో 13 గ్రామ పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,88,54,413 నిధులతో 295 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 10వరకు సామాజిక తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు. రూ.1,80,34,175 వేతనాలు, రూ.8,19,238 నిధులు మెటీరియల్ కోసం వెచ్చించినట్లు పేర్కొన్నారు. అనంతరం డీఆర్పీలు చేపట్టిన సామాజిక తనిఖీ వివరాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏపీడీ నరేందర్‌రెడ్డి, డీవీవో కొండయ్య, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ సునీత, ఎంపీడీవో కుసుమ మాధురి, ఏపీవో మాధవరెడ్డి, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# దుండగులను శిక్షించాలి.. బాధితులకు న్యాయం చేయాలి

కొడంగల్, ఫిబ్రవరి 12 : చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి చేసిన దుండగులను శిక్షించాలని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ డిమాండ్ చేశారు. బుధవారం అధ్యక్షుడి ఆధ్వర్యంలో తెలంగాణ దూపదీప నైవేద్య అన్ని జిల్లాల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అర్చకులు చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడిని కలిసి జరిగిన సంఘటనపై ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది హిందూ ఆలయాల్లోని పూజలు నిర్వహిస్తున్న అర్చకులపై జరిగిన దాడిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఆలయాల్లో పూజలు నిర్వహించేందుకు అర్చకులు ముందుకు వచ్చే అవకాశం లేకుండా పోతుందన్నారు. అర్చకులకు ప్రత్యేక చట్టం తీసుకు రావాలని, హైందవ ధర్మాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి స్వామి, ప్రసాద్ శర్మ, భార్గవాచార్యులు, జయతీర్థాచార్యులు, లక్ష్మీకాంతాచార్యులు, సంతోశ్‌శాస్త్రి, శివ ప్రసాద్, కూర్మలచం శ్రీనివాస్, జంగం మహేశ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడిని కలిసిన దూపదీప నైవేద్య అర్చక సంఘం బృందం

# హయత్‌నగర్‌లో హైడ్రా అధికారుల సర్వే..

**కాల్వను పూడ్చిన వెంచర్ నిర్వాహకులు.. పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు**



మాసబ్ చెరువు వరద కాలువను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు



మట్టిని పోయించి చదును చేస్తున్న కాలువను పరిశీలిస్తున్న సిబ్బంది

హయత్‌నగర్, ఫిబ్రవరి 12 : హయత్‌నగర్ మండల రెవెన్యూ పరిధిలోని అన్మగల్ హయత్‌నగర్‌లో సర్వే నం.69, 70, 71లకు ఆనుకొని ఉన్న వరద కాలువ సరిహద్దులను ఇరిగేషన్ అధికారులతో కలిసి బుధవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. హయత్ నగర్ నుంచి మునగనూరుకు వెళ్లే రోడ్డులో హిందూ శ్మశాన వాటికకు ఎదురుగా ఉన్న వెంచర్‌లో నిర్వాహకులు వ్యర్థాలతో స్థానికంగా చదునుచేస్తున్నారు. తుర్కయాంజాల్ మాసబ్ చెరువు నుంచి పెద్దఅంబర్‌పేటకు వెళ్లే చెరువు కాలువను కూడా పక్కనే ఉన్న వెంచర్ నిర్వాహకులు మట్టితో పూడ్చివేసినట్లు స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా అధికారులు, ఇరిగేషన్ సిబ్బందితో వచ్చి పరిశీలించా రు. ఇరుశాఖల అధికారులు చర్చించి మాసబ్ చెరువు కాలువలోకి వెంచర్ నిర్వాహకులు వ చ్చారా.? లేదా.? అన్న దానిపై నిర్ధారణకు వస్తామని ఇరిగేషన్ ఏఈ సతీశ్ తెలిపారు.

**పట్టించుకోని అధికారులు..**

హయత్‌నగర్ మండల రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.69, 70, 71లకు ఆనుకొని తుర్కయాంజాల్ మాసబ్ చెరువు నుంచి వచ్చే వరద కాలువలో పక్కనే ఉన్న వెంచర్ నిర్వాహకులు యథేచ్ఛగా ఇళ్ల వ్యర్థాలు, మట్టిని పోయించి చదును చేస్తున్నా స్థానిక ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు కనిపించడం లేదా.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా హైడ్రా ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి మాసబ్ చెరువు వరద కాలువను కబ్జాను తొలగించి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలనిప్రజలు కోరుతున్నారు.



లైలా సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో సినీ హీరో విశ్వక్‌సేన్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వలో ఉన్న జేపీ దర్గాను సందర్శించి ప్రార్థనలు చేశారు. - కొత్తూరు, ఫిబ్రవరి 12

## బీఎఫ్ఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్ అండ్ ఫోటోగ్రఫీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్ సైట్ లో చూసుకోవాలని సూచించారు.

## వివిధ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ (ఇంటిగ్రేటెడ్ కోర్స్) 5, 7, 9 సెమిస్టర్ల రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 17వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఎంఈ, ఎంటెక్ (ఏఐసీటీఈ) మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్ష ఫీజును ఈ నెల 20వ తేదీలోగా, రూ.500 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని ఆయన సూచించారు.

## పీజీ కోర్సుల పరీక్ష తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ కోర్సుల పరీక్ష తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోల్లో ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్ డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ, ఎంకామ్ (ఐఎస్) తదితర కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించినట్లు గతంలో ప్రకటించామని గుర్తుచేశారు. పరీక్షలను అదే తేదీ నుంచి ప్రారంభిస్తున్నప్పటికీ, పరీక్షలు నిర్వహించే ఇతర తేదీలను మార్చినట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్ సైట్ లో చూసుకోవాలని సూచించారు.

## జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్.డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ, ఎంకామ్ (ఐఎస్) తదితర కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్ కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్కు రూ.10,000 చొప్పున చెల్లించి ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. inలో చూసుకోవచ్చని సూచించారు.


## వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలతో పాటు బీసీఏ అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే బీఏ, బీబీఏ, బీకామ్, బీసీఏ తదితర యూజీ కోర్సులతో పాటు ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ కోర్సు ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ అన్ని ఫలితాలను ఓయూ వెబ్ సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని ఆయన సూచించారు.

# ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి..

**నగరంలో 10 రోజులుగా పెరిగిన పీఎం స్థాయిలు**

**గాలి నాణ్యత సూచిలో దిగజారిన నగరం**



సిటీ బ్యూరో, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ): భాగ్యనగరంలో కాలుష్య స్థాయిలు మళ్లీ పెరిగిపోతున్నాయి. గత 10 రోజుల నుంచి స్థాయిలకు మించి కాలుష్యం వెలువడుతున్నది. దేశంలో కోల్‌కతాలో అత్యధికంగా కాలుష్య తీవ్రత 155 నమోదు కాగా, గాలి నాణ్యత సూచికలో 128 నమోదై మూడో స్థానంలో ఉండటం ఆందోళనను కలిగిస్తున్నది. గాలిలో సూక్ష్మ, ద్రవరూపంలో ఉండే కణ పదార్థాన్ని(పీఎం) రెండు విభాగాలుగా విభజించారు. అందులో పది మైక్రోకణాలకంటే తక్కువ ఉంటే పీఎం 10 అంటారు. రెండో రకం పీఎం 2.5. ఇవి ప్రధానంగా ఊపిరితిత్తుల సమస్యకు, శ్వాసకోశ సమస్యలకు కారణమవుతాయి. వీటి స్థాయిలు ఈ నెలలో క్రమంగా మారుతున్నాయి. గాలి నాణ్యత సూచికలో 0–50 వరకు అనుకూలమైనదిగా, 51–100 వరకు ఓ మోస్తరుగా, 101–200 వరకు బలహీనంగా పేర్కొంటారు. 201–300 అధిక కాలుష్యంగా, 301–400 అత్యంత హానికం, 401–500 అత్యంత ప్రమాదకరంగా సూచికలో తెలియజేస్తారు. కాగా, ఈనెల ఒకటి నుంచి 8వ తేదీ వరకు కాలుష్య తీవ్రత పెరిగినట్లుగా గాలి నాణ్యత సూచీలు తెలియజేస్తున్నాయి. నగరంలో ఫిబ్రవరి 1న 112, ఫిబ్రవరి 2న 104, ఫిబ్రవరి 3న 102, ఫిబ్రవరి 4న 108, ఫిబ్రవరి 5న 108, ఫిబ్రవరి 6న 106, ఫిబ్రవరి 7న 125, ఫిబ్రవరి 8న 124, ఫిబ్రవరి 9న 131, ఫిబ్రవరి10న 132, ఫిబ్రవరి11న 127 గా నమోదైంది.

**కట్టడి సాధ్యమేనా..**

నిత్యం పెరుగుతున్న వాహనాలు వాటి నుంచి వెలువడే పొగ కారణంగానే అత్యధిక శాతం కాలుష్యం ఏర్పడుతున్నది. రవాణాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 82,45,304 వాహనాలు ఉండగా, అందులో 58,71,539 ద్విచక్ర వాహనాలు, 15లక్షల కార్లు ఉన్నట్లు సమాచారం. ఆవే కాకుండా వేల సంఖ్యలో పరిమితి దాటిన వాహనాలు పట్టణంలో రోడ్లపైకొస్తున్నాయి. వాటి నుంచి వెలువడే పొగ తీవ్రత సైతం కాలుష్యానికి కారణమవుతుంది. నిత్యం పెరుగుతున్న కాలుష్య తీవ్రతను నివారించాలంటే ప్రతి చిన్న పనికి వాహనాలు వాడకుండా నడకమార్గాన్ని ఎంచుకోవాలంటూ పలువురు వైద్యులు సూచనలిస్తుండటం విశేషం.


## తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు



మింట్ కాంపౌండ్ కార్యాలయంలో ఉత్సవాల్లో పాల్గొన్న కార్మికులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు బుధవారం మింట్‌కాంపౌండ్‌లోని ఆ సంఘ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మెజార్టీ యూనియన్‌గా కార్మికుల మన్ననలను పొందుతున్న 1104 యూనియన్ భవిష్యత్‌లోనూ ఇదే విధంగా కార్మికుల కోసం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబు మాట్లాడుతూ.. విద్యుత్ రంగ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి 75 ఏండ్ల కిందట ఈ యూనియన్ ఏర్పాటైందని, అప్పటి నుంచి ఇప్పటివరకు యూనియన్ కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్లాటినం జూబ్లీ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా సబ్‌స్టేషన్, మండల, డివిజన్, జిల్లా, ట్రాన్స్‌కో, జెన్‌కో స్థాయిలో ఘనంగా జరుగుతున్నాయని, తమ యూనియన్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా లేదని, కేవలం కార్మికులు, ఉద్యోగుల పరిష్కారం కోసమే యూనియన్ పనిచేస్తున్నదని చెప్పారు. ప్లాటినం జూబ్లీ వేడుకల సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన యూనియన్ నాయకులను సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

# వ్యాధులను గుర్తించే లాంజ్విటీ లాంజ్



విలేకరుల సమావేశంలో వివరాలు తెలుపుతున్న డాక్టర్ మోహన వంశీ

కొండాపూర్, ఫిబ్రవరి 12: క్యాన్సర్‌తోపాటు కార్డియాక్, బ్రెయిన్ స్ట్రోక్, సంతానోత్పత్తి వంటి ప్రాణాంతక, అతి తీవ్ర వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు, వ్యాధికి తగిన చికిత్సను అందించేందుకు వీలుగా రూపొందించిన లాంజ్విటీ లాంజ్‌ను బుధవారం గచ్చిబౌలిలోని ఒమెగా దవాఖానలో ప్రారంభించారు. దీనిలో భాగంగా ఒమెగా దవాఖాన వ్యవస్థాపకులు డాక్టర్ మోహనవంశీ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి రోజురోజుకు పెరిగిపోతుందని, ఏటా వ్యాధిబారిన పడి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కేవలం క్యాన్సర్ వ్యాధి కాకుండా బ్రెయిన్ స్ట్రోక్, కార్డియాక్ అరెస్ట్, సంతానలేమి సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఇలాంటి సమస్యలను ముందస్తుగానే గుర్తించి తగిన చికిత్సను అందించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉంటుందన్నారు. జన్యుపరమైన పరీక్షల ద్వారా కొన్ని నెలల ముందుగానే రాబోయే వ్యాధులను గుర్తించి వాటికి సంబంధించిన చికిత్సను అందించడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాంటి చికిత్స కొరకు దేశంలోనే మొదటిసారిగా లాంజ్విటీలాంజ్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. అత్యధిక టెక్నాలజీ ద్వారా కేవలం మనిషి ఉమ్మి ద్వారా జన్యుపరమైన పరీక్షల నిర్వహించి భవిష్యత్తులో ఎదుర్కోబోయే ఆరోగ్య సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ జెనిసిస్ట్ డాక్టర్ రాబర్ట్, హనుమంతరావు, చంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవనంపై నుంచి పడిన విద్యార్థినికి స్నేహితుల సాయం



కందుకూరు మండల పరిధిలోని నెదునూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009–2010 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు తోటి విద్యార్థినికి ఆర్థిక సాయం చేశారు . స్నేహితురాలు రాధికా భవనం పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి గాయాలయ్యాయి. దీంతో వైద్యఖర్చుల నిమిత్తం ఆ సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆపదలో ఉన్న తోటి విద్యార్థినికి రూ.50వేలు అందజేశారు. – కందుకూరు, ఫిబ్రవరి 12

## అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు

బడంగ్‌పేట, ఫిబ్రవరి 12 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్లలో ఎక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ సరస్వతి హెచ్చరించారు. ఇప్పటికే అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. నోటీసులకు కొంత గడువు ఇచ్చామని ఆమె పేర్కొన్నారు. నోటీసులకు స్పందించకపోతే యాక్షన్ ప్లాన్ ఉంటుందన్నా రు. కార్పొరేషన్ పరిధిలో ఎవరు ఇండ్ల నిర్మాణం చేయాలనుకున్న తప్పనిసరిగా మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. నిర్మాణదారులు ఇంటి అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఇటీవల కొన్ని అక్రమ నిర్మాణాలను తొలగించడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.